మజిలీ

"మామ్మా! నీ పుస్తకం ఏదో జారిపోయింది చూడు...."

సర్దుతున్న పుస్తకాలలోనించి తలెత్తిచూచింది వరూధిని, మనమరాలు ప్రజ్ఞను.

ఆవిడ, ఆమె నిలబడ్డ భంగిమ.... అరవై ఏళ్ల వయస్సు.... అయినా ఆమెలో వ్యక్తికి వృద్ధాప్యంలేదు. బాధ్యతల బరువులు మోసిన ఆమెకు బలహీనత, ఒణుకు రాలేదు.

"ఏమ్మా! కాలేజీ లేదా? కుర్చీలో జారగిలబడుతూ అన్నారామె.... "లేదు.... హాలిడే... మామ్మా! ఇన్ని పుస్తకాలు ఎప్పుడు చదివావు?" కలరాఉండల పొడుం ఫిలాసఫీ పుస్తకాలమధ్య జల్లుతూ అడిగింది ప్రజ్ఞ. "ఇవన్నీ నాకు స్నేహితులు ప్రజ్ఞా..." ఆప్యాయంగా వాటిని స్పృశిస్తూ అన్నది వరూధిని. "నా జీవితంలో నాకు కావలసిన భాగమంతా వాటి మధ్యే గడిచిపోయింది... ఇంక వయసైపోయి రాలిపోతానేమో ప్రజ్ఞా! నా తరువాత మీకు ఇవి ఉపయోగించాలని నా ఆశ... మామ్మ మెళ్లో బంగారం, బ్యాంకు బాలన్సులకన్నా విలువైనవి ఇవి... ఈ విషయం మీకు తెలియాలి...."

ఆవిడ గొంతులో ఆర్ద్రతకు చలించిపోయింది పద్దెనిమిదేళ్ల ప్రజ్ఞ. "మామ్మా! ఈ పుస్తకం ఏమిటి?" అని మామ్మ దగ్గర పొదివిపట్టుకున్నట్లు కూర్చుంది. ఆ స్పర్శలోనే ఆమె జవాబుంది. అది ఆ ఇద్దరికీ అర్థమైపోయింది.

"ఫ్యూచర్ షాక్!" నవ్వుతూ అన్నది వరూధిని చిలిపిగా చూస్తూ.

"ఏది? ఇంకా నీకు?" ఫకాలున నవ్వేసింది ప్రజ్ఞ.

మెల్లిగా తన చేతిలో పుస్తకాన్ని ఏదో ప్రాణమున్నదానిలా తిప్పుతోంది ఆమె. "మామ్మ ఎప్పటికీ పెద్ద మిష్టరీ..." అనుకుని ఆరాధనగా ఆమెవంక చూస్తోంది ప్రజ్ఞ. ఆమెవయసుపిల్లలకు ప్రస్తుతం సెంటిమెంట్స్ పెద్దగా ఉండే అవకాశంలేదు. వాళ్ళ జీవనవిధానానికి ఒకటే ప్రత్యామ్నాయ పదం.... "ఫాస్టనెస్."

"మీ తరానికి మాకన్నా ఐ.క్యూ ఎక్కువ ప్రజ్ఞా! కానీ మనసు అప్పుడప్పుడన్నా మంచులో తడిసిన మల్లెపూవులా స్పందించాలమ్మా... అదే లేకపోయిన తరవాత పెద్ద చెప్పుకోదగ్గదేం మిగలదేమో...."

ఇలా మాట్లాడే మామ్మ అంటే పిచ్చిఇష్టం ప్రజ్ఞకు. పుస్తకం తిరగేస్తున్న ఆమెనే ఆనందంగా చూస్తోంది ప్రజ్ఞ.

అవును. వరూధిని అందరిలాంటి వ్యక్తి కాదు. "మా అమ్మ నాకు గురువు. ఫిలాసఫర్, గైడ్" అంటాడు కొడుకు రాఘవరావు. జీవనసమరంలో చాలా

పోరాటాలు సలిపి పైకి తెచ్చుకున్నదామె అతణ్ణి. "చాలా డబ్బుగలవాడివి అనడానికి కారణం ఏదన్నా అవ్వచ్చు నాన్నా! వ్యక్తిగా గొప్పవాడివవ్వడానికి నీ ఎఫర్ట్ అవసరం..." అనేది.

"ఆc! ఎవరి ఖర్మ ఎలావుంటే అలా అవుతుంది" అని దీర్ఘం తీసేది అత్తగారు. ఆవిడకు కోడల్ని చూస్తే ఇష్టంలేకకాదు, ఆమె ఆత్మస్థైర్యం చూస్తే మంట...

వరూధిని భర్త ఆమెను నానా హింసలూ పెట్టి, వదిలేసి, మరొక పిల్లను పెళ్ళిచేసుకుని, "అవతలవాళ్ళు నామీద కేసుపెడతానంటున్నారు వరూ! ఏమిటి దారి?" అని బిక్కమొహం వేసుకుని వచ్చినప్పుడు, "అస్తంతా తగలబెట్టావు. ఇప్పుడు దేవతలాంటిదాని ఉసురుపోసుకున్నావు...." అని మెటికలు విరిచినా, 'చూద్దాం కోడలేం చేస్తుందో' అనుకున్నదామెగారు.

నిర్లిప్తంగా, కళ్ళనీళ్ళను గుండెల్లోకి వంచేసి, 'అతనితో నాకు ఏ సంబంధం లేదు....' అని కాగితం రాసిచ్చి లీగల్‌గా అతన్ని రక్షించింది. కానీ అలా అసహ్యకరమైన అనేక సంఘటనలతో తడిసి బరువెక్కిన ఆమె మనసు, జీవితంలో ఆమెను చాలా ఒంటరిదాన్ని చేసింది.

అదుగో, అల్లాంటి వ్యక్తిత్వాలంటే మంట ఆమె అత్తగారికి. ఆవిడ సంఘంలో ఒక వర్గానికి ప్రతినిధి.

"అయ్యో! మొగుడొదిలేసిన పిల్ల. దాన్ని చూస్తే కడుపు తరుక్కుపోతోంది" అని పదిమందికి చెప్పి కళ్ళనీళ్ళు తుడుచుకునే అవకాశం, కనీసం అలా చేసి చూపించే అవకాశం కూడా ఇవ్వని ఆడదంటే మండిపోయేది ఆవిడకు. అందుచేతనే రెండెకరాల కొంప్ర మనుమడిపేర రాసేసి కచ్చతీర్చేసుకున్నా ననుకున్నది ఆవిడ.

వీటికి వేటికీ చెదర్లేదు వరూధిని. టీచరుగా ఉద్యోగంలో చేరి ఆ తరవాత ఎమ్.ఏ.కు కట్టి లెక్చరరైంది ఆమె. పరిణతిచెందని వ్యక్తిత్వంవల్ల పసిబిడ్డలా తప్పటడుగులు వేసిన తన భర్తకుండే అల్పత్వం తన బిడ్డకు ఉండకూడదని ప్రయత్నించింది.

పాఠాలు చెప్పడంలో, స్టూడెంట్స్‌ను దగ్గరకు చేర్చడంలో, ఓదార్చడంలో - అన్నింటిలోనూ ఆమె ప్రత్యేకత ఆమెకుండేది.

ఎంబ్రాయిడరీ చేసినా, గ్రీటింగ్స్ తయారుచేసినా, ప్రతిదాన్లోనూ ఆమె తాదాత్మ్యత కనిపించేది.

"మీరు భగవద్గీత చదువుతారా?" అడిగాడు తోటి లెక్చరర్, రోజూ ఆమె చేతిలో "ఫిలాసఫీ ఆఫ్ గీత" పుస్తకంచూస్తూ.

"అది బట్టీపట్టే టైం నాకెక్కడుందండీ? చేస్తున్నపనిలో అటాచ్‌మెంట్ విత్ డిటాచ్‌మెంటు లాగా ఉంటుంది నాబోటిదానికి. ఇదే గీతాతత్వమైతే ఇంక కావలసినదేమిటి చెప్పండి?" అన్నది నవ్వుతూ.

"ఇంత స్పందన, చక్కదనంతో భర్త దూరంగా ఉన్న ఆడది... మరీ అలా ఏ

ఎఫైర్ లేకుండా..." ఇలా ఆలోచించేవారు చాలామంది చాలా సహజంగా. కొంతమంది డైరెక్ట్‌గా అడిగేశారు కూడా.

"మన మేరేజ్ సిస్టం రక్షణకోసం ఏర్పడిందే కానీ, మీరు చెప్పినంత పరిణతి చెందలేదండీ... భర్త ఉన్నంతమాత్రంచేత ప్రతి కోరికా తీరిపోయి, లేనంతమాత్రంచేత సర్వం పోయిందనుకునేటంత అద్భుతమైన ప్రేరణ అనుభవించడం లేదు అందరూ, అందుకని నాకు ఒంటరితనం మరీ పెద్ద బాధేంకాదు..." మెల్లిగా చెప్పేసింది నవ్వుతూ.

"మావారు నేను లేకపోతే మంచినీళ్లైనా తాగరు, మావారు అసలు ఆడదీమనుకూడా చూడరు...." అని గందరగోళంగా చెప్పే హోంసైన్స్ లెక్చరర్ ఒక్కసారి ఉలిక్కిపడింది ఆ మాటకు. అందులో ఉండే పచ్చి నిజం, తన మాటల్లో ఉండే ఆత్మవంచన ఆమెకు అర్థమైనాయి. కానీ సగటుమనిషి ఎప్పుడూ పచ్చినిజాన్ని భరించలేదుకాబట్టి. ఆవిడ భయం కోపంగా, అది అసూయగా మారి, కొన్నాళ్లు ఇబ్బంది పెట్టింది వరూను.

ఆమెకు స్నేహితులుండేవారు.... కానీ, స్నేహంలో ఉండకూడనిది అసూయ అనీ, ఉండవలసినది నిజాయితీ అనీ ఆమె దగ్గరే నేర్చుకున్నారు వాళ్లు.

ఆమెకూ చిన్న చిన్న భ్రాంతులు, వ్యామోహాలు ఉండేవి. ఆమెలో పరిణతిచెందిన వ్యక్తికి, ఈ చిత్త చాంచల్యం ఉన్న వరూధిని చిన్నపిల్లలా కనిపించి నోరు మూయించగలిగేది.

"మిమ్మల్ని భార్యగా చేసుకోవాలనుకుంటున్నాను. మీరంటే నాకు చాలా ఆరాధన... మీరు ఒప్పుకోకపోతే....మిమ్మల్ని నా సహోదరిగా చూసుకుంటాను.... నాకు రీసెంటుగా భార్య పోయింది." గోళ్లు కొరుక్కుంటూ భయంభయంగా అడిగాడు ఒక ప్రొఫెసర్.

"ప్రపంచంలో ఆడా మగా మధ్య ఉండే సంబంధాల్లో కొన్ని సెక్సుకు అతీతమైన స్నేహాలుంటాయి. దాన్ని అన్నాచెల్లెలు సంబంధం అని ఆత్మవంచన చేసుకోనక్కర్లేదు. మనుష్యులమధ్య వేవ్‌లెంగ్త్ (Wave length) దూరమైనప్పుడు చిరునవ్వుతో తప్పుకోవడం తెలివైనపని. పెళ్ళాంగానో, చెల్లెలుగానో తప్ప ఆడదాన్ని మరొకరకంగా ఆలోచించలేరా ప్రొఫెసర్ సాబ్?" అని జవాబిచ్చేటప్పటికి బుర్రగోక్కుని, ఆలోచిస్తూ అదృశ్యమైపోయాడు ఆయన.

అలా కత్తిమీద సాములా జీవితాన్ని నెట్టుకువచ్చింది ఆమె.

"అమ్మా! నాకు నీలాంటి అమ్మాయి దొరికినప్పుడు చేసుకుంటాను...." అన్న బిడ్డను వాత్సల్యంతో చూస్తూ – "నాన్నా! నాలాంటి అమ్మాయి దొరకదు.... తయారవుతుంది పరిస్థితులవల్ల... ముందు పెళ్ళిలో ఉండాల్సింది స్నేహబంధం.... ఏ పిల్లనైనా స్నేహితురాలుగా నువ్వు గౌరవించగలిగినప్పుడే భార్యగా తెచ్చుకో" అనేదామె.

ఆమె జీవితం అలా సాగిపోయి ఈనాడు డెబ్బయ్యోవ పడిలో పడింది.

"నాకు నువ్వే గతి..." అని కొడుకు ఇరవయ్యోవ ఏట పుట్టెడు జబ్బుతో వచ్చాడు భర్త.

మాట్లాడకుండా సేవ చేసింది.

"నేనంటే నీకు ఎంత ప్రేమ? నీలాంటి పతివ్రతలు..." అని మాటలతో కోటలుగట్టే చాలామంది కోవకు చెందిన అతణ్ణి చూసి, "మీమీద నాకు జాలి.... ఎందుకు ఇలా అయిపోయారా అన్న బాధ.... ప్రేమ చాలా సున్నితమైందండీ.... దానికి చాలా పోషణ కావాలి... అలాంటిదేదో మన మధ్య ఏనాడో పోయింది" అని తేల్చి చెప్పేసింది.

అవన్నీ గుర్తుకు వస్తున్నాయి ప్రజ్ఞకు మామ్మను చూస్తుంటే.... ఆమెకు ఎంత ఇష్టమో మామ్మంటే... చాలా విషయాల్లో ఆవిడను ఇమిటేట్ చేస్తుంది ప్రజ్ఞ.

"ప్రజ్ఞా!" తల్లి కాబోలు పిలిచింది.

"ఆ - వస్తున్నా స్నానానికేనా... తాయమ్మా! నా అల్మారాలోనించి బట్టలు తెచ్చిపెట్టు...." అరుస్తూ లేచింది ప్రజ్ఞ.

"చూడు అమ్మలూ...." కళ్ళజోడులోనించి సూటిగా చూస్తూ అన్నది వరూధిని.

"ఏమిటి మామ్మా?"

"ప్రతిదానికీ పనివాళ్ళమీద ఆధారపడటానికి నేర్చుకోకు. నువ్వు చేసే పనులకు వాళ్లను సహాయం చేయడానికి పెట్టుకున్నాననుకో... అంతేకానీ, నీ బట్టలూ నీ తిండీ ఇల్లాంటివన్నీ వాళ్ళకు వదిలేస్తే, కొన్నాళ్ళకి వాళ్ళ టేస్టులు నిన్ను, నీ ఆలోచనలను డామినేట్‌చేసి, నీకంటూ ఏం మిగలదు. వాళ్ళు నిన్ను చూసి, వాళ్ళ స్థితినుంచి మరొక మెట్టు ఎదగాలి కానీ, నువ్వు వాళ్ళల్లో ఒకదానివవకూడదు. ఇది ఆర్థికపరిధిని దాటి ఆలోచించవలసిన సమస్య.... అర్థమైందా?"

ఒక్క క్షణం బిత్తరపోయి చూసింది ప్రజ్ఞ... వెంటనే "మామ్మా! యూ....యూ!" అని కౌగిలించుకొని ముద్దుపెట్టుకుని తూనీగలా పారిపోయింది.

అటే చూస్తూ, నవ్వుకుంటూ, బుగ్గ తుడుచుకుని చేతిలో పుస్తకంలో పేజీలు తిప్పింది వరూధిని.

"To love one self is the beginning of a life long romance-" Oscar Wild... అని రాసివున్నది.

అలా ఆ అక్షరాలవంకే చూస్తున్న ఆమె కన్నుల్లో నీటిపొర... ఆలోచనలు సుడులుతిరుగుతూ దాదాపు నలభై ఏళ్ళ క్రితానికి....

❀ ❀ ❀

ఏదో ఇంటర్వ్యూకోసం బైలుదేరింది వరూధిని. రైలు ప్రయాణం... బెర్త్‌దొరక్క సీటుతో అడ్జస్ట్ అయిపోయింది.

ఏదో మెగా పుస్తకం చదువుతోందామె.

'చూడండి' ఎవరో పిలిచారు.

ఉలిక్కిపడి తలెత్తి చూసింది.

ఎదురుగా ఎవరో వ్యక్తి... చాలా మామూలుగానే ఉన్నాడు. కళ్లుమాత్రం చాలా చురుగ్గా ఉన్నాయి.

"మీ కభ్యంతరం లేకపోతే కొంచెం మంచినీళ్ళు...."

ఇలా ప్రారంభమైన సంభాషణ కాసేపట్లో కొంచెం పరిచయస్తుల్ని చేసింది.

అతనికి చాలా వాక్చాతుర్యం ఉన్నది. ఒక సబ్జెక్ట్ గురించి మాట్లాడటం అయిపోగానే, ఆ ముగింపునుంచే మరొక కొత్త సబ్జెక్టులోకి తప్పనిసరిగా ఎదుటివాళ్ళను లాక్కెడతాడతను.

కాసేపైన తరవాత ఆ మాటే చెప్పింది అతనికి

"చూశారా మేడం!.... ఇంత గొప్ప విషయాన్ని ఈ భారతదేశపు రైలు కంపార్ట్‌మెంట్‌లో మీరు కాబట్టి కనిపెట్టారు. ఇంతవరకూ నా చుట్టూవుండే ఎవ్వరూ ఆ విషయం గుర్తించలేదండీ!..." అన్నాడతను అల్లరిగా.

నవ్వేసింది ఆమె....

ఉన్నట్టుండి, ఒక పెద్ద కుదుపుతో, హాహాకారంతో ఆగిపోయింది రైలు.

దాదాపు ఐదారుగంటలు.... అటు అడవి, ఇటు ఊరు మధ్యలో....

సగం రైలుజనం దిగారు. నానాగందరగోళం.... అంతటి జనారణ్యంలో వీళ్ళిద్దరూ మరింత సన్నిహితులైపోయారు.

ఆ కాస్త పరిచయంలోనే, విపరీతమైన పరిశీలనా జ్ఞానం ఉన్న వరూధినికి, అతనుకూడా ఏదో తెలియని ఒంటరితనంతో బాధపడుతున్నాడనిపించింది. కానీ అతడు ఎక్కడా బైటపడటంలేదు.

పొద్దుపోయినతర్వాత రైలు కదిలింది. అలసిపోయిన ప్రయాణీకులు నిద్రకు జోగుతున్నారు.

ఆమె, అతను మాత్రం మేలుకొనేవున్నారు.

"మేడం!"

"ఊఁ."

"మీకు పామిస్ట్రీ చెప్పనా?" చాలా ఉత్సాహంగా అడిగాడతను.

"ఈ డిమ్ లైట్లోనా?"

"భలేవారే.... రేఖలు నాతో మాట్లాడతాయండీ!"

నవ్వుతూ చెయ్యి చాచింది ఆమె.

"వెరీగుడ్...." ఫుల్ హాండ్స్ పైకి మడుస్తూ చాలా ఉత్సాహంగా ముందుకు వంగి ఆమె చేతిమీద టార్చివున్న బాల్‌పాయింట్ పెన్ను ఫోకస్ చేస్తూ చూస్తున్నాడతను.... అతని చేతికివున్న రవ్వల ఉంగరం చటుక్కున మెరిసింది.

"ఎవరితనూ?" ఒద్దన్నా మనసు ఆలోచిస్తోంది.

"మీరు చాలా సెంటిమెన్టలిస్ట్! అవునా?"

"నిజమే." నవ్వేసింది.

"ఏ చిన్న బాధకూడా పెద్దదిగా చేసేసుకుని, ఎదటివాళ్ల ఆలోచనలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి, అది మీలోమీరే ఇముడ్చుకుంటారు... అవునా?"

చటుక్కున తలెత్తిచూసింది.

ఆ చూపులో తెలియని చురుకుతనమున్నది. హాయిగా నవ్వేశాడతను.

"క్షమించండి మేడం!... మీ "ఎగో" దెబ్బ తీసినట్లున్నాను. మంచి స్నేహితుడిగా మిగిలిపోవలసినవాణ్ణి అలా చేసుండకూడదేం?"

"ఉ.... ఇంకా....?" నవ్వుతూ అన్నది.

"మీకు కోపం రాదంటే చెప్తాను...."

"ఫరవాలేదు...."

"అందులో రెండు మూడు పొగడ్తలు కూడా ఉండచ్చు..." చాలా సీరియస్‌గా, కొంచెం చిలిపిగా అన్నాడతను.

మాట్లాడలేదు... నవ్వాపుకుని తలెత్తి చూసింది ఆమె.

"మీరు చాలా ప్రత్యేకమైన వ్యక్తి... మీ టేస్ట్, మీ మాటలు, మీ చూపులు, మీ జీవితం.... అది బాధాకరమైనప్పటికీ, చాలా చాలా అద్భుతంగా ఉంటుంది."

చెయ్యి చూస్తూ చెప్పేస్తున్నాడతను. అరిచేతిలో అతని బాల్‌పాయింట్ పెన్ను ఒకరకమైన గిలిగింతలు పెడుతోంది.

ఒంట్లో సన్నటి ఒణుకు వచ్చింది.

ఎవరితను? ఈ రైలు కడుపులో, చుట్టూ చీకటి, నీలిరంగు దీపకాంతి తప్ప మరేం లేనిచోట, ప్రపంచమంతా నిద్రపోతున్నవేళ... ఏం జరుగబోతోంది? సాటి ప్రయాణీకుడైనవాడు తన మాటలతో, చేతలతో అతి దుఃఖభాజనమైన, ఎడారి అయిన ఆమె జీవితంలోకి మాధుర్యపు జల్లులు కురిపిస్తున్న ఇతనెవరు?

"మీకు మొనాటమీ ఎందుకో తెలుసా మేడం?"

ఉలిక్కిపడి 'ఎందుకు?' అన్నట్లు కళ్ళతో ప్రశ్నించింది.

"అదెవరూ గుర్తించరనే...."

సన్నగా నవ్వేసింది ఆమె.

"మీ పర్సనల్ లైఫ్ నాకు తెలియదు. కానీ మీరు అంటే ఏమిటో ఎవరికీ తెలియదు. అదిమాత్రం తెలుస్తోంది...."

రాత్రి పన్నెండుగంటలు... చలికాలం... ఒంటినిండా చీర కప్పుకుని ఒద్దికగా కూర్చున్నట్లుంది ప్రకృతి... బైట చుక్కలమధ్య చంద్రుడు సాక్షిగా వస్తున్నాడు ఈ పరిచయానికి.

అతని గొంతులో ఒక స్థాయి, సాత్వికత ఉన్నాయి. ఆ మాటలు పన్నీరు పుష్పాల్లాగా, చల్లదనంతో, తెలియని పరిమళంతో కేవలం వింటున్నవారికి వినాలనిపించేవే అర్థమయ్యేట్లున్నాయి.

'విచిత్ర వ్యక్తి'

"ఈ ఫ్రస్ట్రేషన్‌తో కొన్నాళ్ళకి మీరు పిచ్చివారైపోవచ్చు. మీకు మీమీదే చాలా కోపం ఉంది.... అందరిలా బ్రతకలేకపోవడంవల్ల, ప్రపంచంతో రాజీపడలేక పోవడంవల్ల వచ్చే కసివుంది. అవునా?..." సీరియస్‌గా చెప్పేసుకుంటూ పోతున్నాడతను.

నిజం ఆ మాట... ఎలా తెలుసు ఇతనికి? ఎవర్నీ ఏమీ చెయ్యలేక తన ఆలోచనల ధాటికి తట్టుకోలేక, తనను తాను శిక్షించుకుని, హింసించుకున్న రోజులున్నాయి.

ఎలా చెప్పగలుగుతున్నాడు? ఫ్రాయిడ్‌లాంటి సైకో ఎనాలిసిస్టా?.... కాలి అంజనం పారేసుకుని, ఖర్మకాలి భారతదేశపు రైల్లో ప్రయాణంచేస్తున్న ప్రవరాఖ్యుడా? కానీ ఇతని చురుకుదనం అతనికెక్కడిది? ఉంటే స్వారోచిష మనుసంభవం మరోరకంగా పరిణమించేది.

బెథోవెన్ సంగీతంలా, ఆస్కార్ వైల్డ్ కొటేషన్లా.... ఒక మత్తుతో పడేస్తున్నాడు. అతని వంకే చూస్తూ, చెంపన చెయ్యిపెట్టుకుని ఆలోచిస్తోంది ఆమె.

"మేడం! ... మీరు కొంచెం కిందికి చూస్తే నా పని సులువౌతుంది... మీవి ఎక్స్‌రేల్లాంటి కళ్ళు... Most unforgetable eyes.... ఎదటి మనిషిని మాట్లానియ్యవవి...."

ఉలిక్కిపడి చటుక్కున కిందికి చూసింది.

ఆమె అర్థంకాని అడవిలో, హరిచందన సుగంధాల మధ్య గురివిందగింజల పొదరింట్లో చిక్కుకుపోయినట్టుగా ఉంది.

"మనసా? నువ్వెంత భయంలేనిదానివి?" కోప్పడింది ఆమె.

"మీ జీవితం హాయిగా ఉండాలంటే చిన్న ట్రిక్ ఉంది మేడం!... వెరి సింపుల్ ట్రిక్...."

"చెప్పండి..."

"లవ్ దై సెల్ఫ్"

"ఆఁ!" అన్నది ఉలిక్కిపడి.

"అదేమిటండీ, అలా ఉలిక్కిపడతారు? నేనేదో ఎట్టెదటవున్న మొట్టమొదటి వ్యక్తిని ప్రేమించెయ్ అన్నట్లు... మిమ్మల్ని మీరు ప్రేమించుకోవటం నేర్చుకోండి ముందు... కొంత ఓదార్పు వస్తుంది.... మీ మీద మీకు పెరిగిన ప్రేమ, మీలాంటి మనిషిని బ్రతకనిస్తున్న ఈ ప్రపంచం మీదికి విస్తరిస్తుంది. మీరు చాలా తెలివిగలవారు. పైగా, నాకు అర్థమైనంతలో చాలా దెబ్బతిన్న వ్యక్తి... అవునా?"

మాట్లాడలేదామె.... రెండేళ్ళ పసిబిడ్డతో, మొగుడు ఒదిలేసిన ఆడదని ముద్రపడి, భయంకరమైన సాంఘిక కట్టుబాట్లున్న వ్యక్తులమధ్య బ్రతుకుతున్న ఆమె ఏం మాట్లాడగలదు?

"అందుకే మీ ప్రేమను ఉచ్చుచేసి మనిషిని బాధపెట్టరు...."

ఇబ్బందిపడిపోతోంది ఆమె.... చాలా మామూలుగా, కొంచెం మందలిస్తున్నట్లుగా ఏదో బిజినెస్ వ్యవహారాలు చెప్తున్నట్లుగా మాట్లాడుతూ అతను పొగడ్తలతో అభిషేకం చేస్తున్నాడు.

అది తప్పించుకోనూ లేకుండా ఉన్నది... ఇష్టపడలేకుండానూ ఉన్నది.

బైటకు చూసింది కిటికీలోనుంచి...

ఉషస్సు రెక్కలు విప్పుకొంటున్నది... మరొక నాలుగు అయిదుగంటల్లో గమ్యస్థానం చేరుకుంటాము. అప్పుడు ఇతనెక్కడో.... నేనెక్కడో?....

"మీకొక డిఫెక్ట్ ఉన్నది..." పెన్ను బుగ్గకానించుకుంటూ అన్నాడు.

గభాల్న కనుబొమలు ముడిపడ్డాయి. సీరియస్‌గా చూసింది.

"మీరు రేపటి గురించిన భయాల్తో, ఇప్పటిక్షణాన్ని చెయ్యిజారవిడుచు కుంటారు.... అవునా?"

నీలిరంగుకాంతిలో ఒక కిరణం అతని జుట్టుమీద నుంచి వక్రీభవించి, కనురెప్పలమీదుగా జారి, పెదవి నునుపుమీద నిలిచింది. చాలా ఉత్సాహంగా, చిన్న పిల్లాడిలా ఉన్నాడతను.

"ఫ్యూచర్ షాక్" చదివారా?"

"లేదే?"

"అమ్మయ్యో! ఇప్పటికి మాట్లాడారు... అదయినా నేను మాట మారిస్తే... అబ్బే....చాలా మంచిగా కనిపించే మీలో బొత్తిగా ఎదుటివారి అనుభూతులపట్ల సానుభూతి లేదు మేడం!... ఓ.కే. అది చదవాల్సిన పుస్తకం...."

"అవును... విన్నాను.... నాకు దొరకలేదు."

"నా దగ్గర ప్రస్తుతం ఒకటే కాపీ ఉన్నది... నేను కొని పంపుతాను... అడ్రసివ్వండి....."

చాలా మామూలుగా డైరీ తీస్తూ అన్నాడతను.

అంతరాంతరాల్లో ఈ క్షణం కోసమే ఎదురుచూస్తోంది ఆమె. ఈ చక్కటి స్నేహపరిమళానికి ఒక ముద్రవేసి, దాన్ని పెంచి.... పెద్ద....

"నేనొక విషయం చెప్పనా?" సూటిగా చూస్తూ అన్నది.

"అరె బాప్‌రే... అంతకన్నానా? నేను బోలెడు విషయాలు చెప్పేశాను అప్పుడే...."

ఆమెకు నవ్వు వచ్చింది... పెదవి నొక్కిపెట్టి ఆపుకున్నది. అటే చూస్తున్నాడని తెలుసు ఆమెకు. అందుకే ఎటో చూస్తూ....

"మన ఈ పరిచయం... ఎందుకో తెలియదు - స్నేహంగా మారింది... అవునా.... దీన్ని ఇలాగే ఉండనివ్వండి...." దెబ్బతిన్నట్లు చూశాడతను.

ఆమె గమనించనట్లుగా మాట్లాడింది.

"రేపు అన్నది చాలా పెద్ద నాకెప్పుడూ... నన్ను ఇంత బాగా స్టడీచేసిన మీరు రేపు నాకు పరిచయస్తులై, స్నేహితులై... ఆ తర్వాత మీతో స్నేహానికి నా ఇంటి పరిస్థితులు అనుకూలించకపోతే.... అస్సలు భరించలేను నేను... అర్థమౌతోందను కుంటాను మీకు...."

రెండు అరిచేతుల మధ్య మొఖం పెట్టుకుని వింటున్న అతను తలకాయ ఊపాడు.

"పోనీ! నా అడ్రస్..." ఒక్క క్షణం తరువాత అన్నాడతను.

"నో ప్లీజ్... అడ్రస్ తెలిసీ, మిమ్మల్ని కలుసుకోలేకపోవడం మరీ దారుణం.... తెల్లారిపోయినట్లుంది... వాష్ చేసుకుని వస్తాను..." టవల్ తీసుకుని, అతని వంక చూడకుండా బాత్‌రూమ్ పక్కకు వెళ్లిపోయిందామె. కావాలనే స్టేషన్ దగ్గరపడేదాకా అక్కడ ఎవరితోనో మాట్లాడుతూ ఉండిపోయింది.

తిరిగి వచ్చేటప్పటికి అతను డ్రస్ ఛేంజ్ చేసుకుని మామూలుగా ఉన్నాడు.

ఆమెను చూడగానే, "వెరీగుడ్ మేడమ్ - మీరు చెప్పిన దాంట్లోనూ పాయింట్ ఉంది. ఇదుగో... నా జ్ఞాపకార్థం ఈ పుస్తకం అట్టేపెట్టేసుకోండి. వస్తాను, స్టేషన్ వచ్చేసింది..." అన్ని వస్తువులూ సర్దేసుకుంటూ అన్నాడు.

అతణ్ణి వెతుక్కుంటూ ఒక డ్రైవర్, మరొక పనివాడు వచ్చారు. ఇంతమంది మార్బలం ఉన్న వ్యక్తి ఇంత నిరాడంబరంగా, మామూలుగా స్లీపర్‌లో...

గబగబా నడుస్తూ, జనంలో కలిసిపోతూ, వెనక్కుతిరిగి ఒక్క క్షణం ఆమెను కళ్ళతో ఫోటో తీసి మనసులో దాచుకున్నాడేమోనన్నట్లు చూసుకుని వీడ్కోలు చెప్పి వెళ్లిపోయాడు.

మెల్లిగా చెయ్యి ఊపిందామె, కళ్ళల్లో ఉబికి వస్తున్న నీరు దాచుకుంటూ.

❀ ❀ ❀

ఇంటర్వ్యూ అయ్యి, తెలిసిన బంధువులింటికి వెళ్ళి, విశ్రాంతిగా అతనిచ్చిన పుస్తకం తీసింది.

అందులో ఎక్కడైనా అడ్రస్ రాశాడేమోనన్న ఆశ ఆమెకు తెలియకుండానే పుస్తకం వెతికిస్తోంది.

పేజీలు తిప్పుతూ ఆగిపోయింది.

ఉత్తరం....

"పేరు తెలియని మీకు?-

క్షమార్పణలు.

ఈ మాత్రం చనువుకూడా తీసుకోవడం మీకు ఇష్టం లేదని తెలుసు నాకు. కానీ, ఇదే క్షణంలో నేనెంత కుతూహలంతో బాధపడుతున్నానో అంతకి రెట్టింపు తపన మీకు ఉంటుందని తెలుసు నాకు.

కానీ, ఫ్రెండ్!.... మన పరిచయం ఇంతటితో ఆగిపోవాలని మీరు విధించిన ఈ శిక్ష.. సామాన్యమైనది కాదు... కానీ జీవితంలో అత్యంత ఇష్టమైనవాటికి అతి దూరంగా బ్రతకడంలో ఉన్న బాధలో తెలియని ఓదార్పు ఉన్నది. దీన్ని మీరు ఏమన్నా అనండి.... "సినికల్ హాలోనెస్" కావచ్చు... ఇది నిజం.

ఐ పార్డన్స్ టు యు... నాకు అసలు పామిస్ట్రీ రాదు. కానీ, దాదాపు పదిగంటలు మిమ్మల్ని మీకు తెలియకుండా స్టడీచేసే అవకాశం వచ్చింది నాకు. ఎదటివారిని పుస్తకంలా చదవగల శక్తి భగవంతుడు నాకు ఇచ్చాడు. అదే నా పాలిట శాపంకూడానేమో.... ఎందుకంటే, నా చుట్టూ ఉన్న మనుష్యులు నటించే ప్రేమ, ఆప్యాయతల అసలు రూపాలు నాకు తెలిసిపోతూంటాయి. కొంచెం అజ్ఞానం, కొన్ని అమాయక సత్యాలు ఈ జీవితం ఇది అని చెప్పకుండా బ్రతకనిస్తాయేమో!

మేడం! నా గురించి కొంచెం చెప్పుకోవాలనుంది, మీరు అడక్కపోయినా... నాకు తెలుసు, ఒద్దనుకుంటూనే మీరు నా గురించి తెలుసుకోవాలనుకుంటున్నారు.

నేను నిన్న ఎ.సి స్లీపర్ దొరక్క మీ కంపార్టుమెంటులో ఎక్కాను... పుట్టిన దగ్గరనుంచీ నా జీవితంలో అడుగడుక్కు ఆడంబరాల మధ్యతప్ప ఉండకూడదన్నట్లు బ్రతికాను నేను. కానీ... కానీ, వీటిలో మొనాటనీ నన్ను అందర్నించీ విడదీస్తోందన్న భావం ఈమధ్య ఎక్కువైంది నాకు.

కారణం ఏమిటో తెలుసా? ఈ 28 ఏళ్ల జీవితంలో జీవన సత్యం చాలా ఆలస్యంగా తెలిసింది నాకు. అదేమిటంటారా?

ఆరునెలలకన్నా నేనుండనని... మేడం!... ఆశ్చర్యపోకండి... డాక్టర్లు చెప్పేశారు. నా రోగకారణాలు చెప్పి భయపెట్టను మిమ్మల్ని. విషయం ఏదన్నా అవ్వచ్చు. "నేను చచ్చిపోతాను" అని తెలిసిన తరువాత మనుషులు చాలా బాగా అర్థం అవడం ప్రారంభించారు నాకు... నా పేరన ఉండే షేర్లు, నా కార్లు అప్పుడే మానసికంగా పంచేసుకుంటున్నారు. మా వాళ్ళు. పైకి మాత్రం నీకేం తక్కువ - మేమున్నాము అన్నట్లు ప్రవర్తిస్తారు. ఈ తెచ్చిపెట్టుకున్న అరిస్టోక్రసీతో మనిషి పడే బాధ ఇదే మేడం!... వీళ్ళకు దేనిమీదా నమ్మకం లేదు... అన్నింటినీ అందరికోసం నటిస్తారు... ఎందుకు చేస్తారీ దురదృష్టం? అనుభవిస్తే తెలుస్తుంది. మా ఇంట్లో వారానికి ఒక డిన్నరు జరుగుతుంది. వందమంది వస్తారు. ఏ ఒక్కరూ గట్టిగా మాట్లాడరు.... హాయిగా నవ్వరు.... ఆడవారైతే మరీ అన్యాయం... కౌగిలింతలు, పూవులే... లేటెస్ట్ మూవీ, పిల్లల ఆరోగ్యం, ఎన్ని కిలోలు తగ్గారు - ఇలాంటి కొలత ప్రకారం పలకరించుకోవడానికి కొన్ని మాటలుంటాయి. ఎన్నిసార్లు విన్నా ఇవే....

ఒకప్పుడు నేనూ వీరిమధ్య మనిషినే.... ఈ ప్రపంచం నుంచి శాశ్వతంగా సెలవు తీసుకుంటున్నానని తెలిసినప్పటినుంచీ, ఇదంతా భరించలేకపోతున్నాను.

మనస్ఫూర్తిగా మాట్లాడేవాళ్ళు కావాలనిపిస్తోంది. ఈ స్థితినుంచి మమ్మల్ని ఎవరూ రక్షించలేరు.

అల్లాంటి నాకు మీరు రైల్లో చాలా విచిత్రంగా ఎదురయ్యారు. సాయంత్రం రైలు ఆరుగంటలు అడవిలో ఆగిపోయినప్పుడు మిమ్మల్ని పరీక్షగా చూస్తూ కూర్చున్నాను. తోటివారి పట్ల మీకు సహృదయత, కబుర్లు, మీరు... ఇదంతా ఏదో సృష్టిలయలో భాగంగా... అనిపించింది... హాయిగా మాట్లాడుతూ, హాయిగా నవ్వుతూ ఉన్న మిమ్మల్ని చాలా స్టడీ చేశాను.... మీ నవ్వే కళ్ల వెనక నైరాశ్యం, బెదురు చాలా చెప్పాయి నాకు.... అందుకే పామిస్ట్రీ అంటూ నేను మీ గురించి చెప్పినదంతా సైకలాజికల్ స్టడీ... కంగ్రాట్యులేట్ మీ....

ఇంక చక్కటి స్నేహాన్ని మీరు మామూలుగా ఆలోచించి ఆపుచేశారు. కానీ మేడం.... ఒక్క సలహా.... మృత్యు ముఖంలో ఉన్న నేను మీకు మంచి స్నేహితుడిగా ఒక మాట చెపుతాను:

మిమ్మల్ని మీరు మరీ అంత బాధ పెట్టుకోకండి... ముందు మిమ్మల్ని మీరు ప్రేమించుకోండి. మీలాంటి వ్యక్తిని బ్రతకనిస్తున్న ఈ ప్రపంచాన్ని ప్రేమించండి. దాని తప్పుల్ని చూసి జాలి పడండి. క్షమించడం వస్తే ప్రపంచంలో ప్రతిదీ ప్రేమించ తగ్గదిగా అనిపిస్తుంది మేడం.

ఈ అంతిమ ఘడియల సంగతి అయిదేళ్ల క్రితం తెలిసింది నాకు. అప్పటినుంచీ మృత్యువును అర్థం చేసుకోవాలని ప్రయత్నిస్తున్నాను. After death what happens? అని చాలా చదివాను. జీవితం అందరికీ సుదూర ప్రయాణం. ఈ ప్రపంచంలో గడిపే కొద్ది రోజులూ ఒక మజిలీ లాంటిది. అది తెలిసిన తరవాత మృత్యువు గురించి అంత బాధగా లేదు.... నా ఈ చిన్న మజిలీలో మీ పరిచయం ఒక అందమైన పిక్నిక్ లాగా అనిపించింది.

అంతిమ ఘడియల్లో ఇష్టమైనవారు దగ్గరుండాలనిపిస్తుంది. కానీ అడ్రస్ ఇవ్వనని మీరు నాకు ఆ అవకాశం కూడా దూరం చేశారు. తీరని కోరిక ఉంటే మరొక జన్మలో మనకు ఇష్టమైనవారి దగ్గర పుడతామట... చూద్దాం.... నేను సహజంగా ఆశాజీవిని.

చచ్చిపోతూ కూడా ఆశలో బ్రతికే నన్ను చూసి నవ్వుకోకండి మేడం.... గుడ్‌బై మై ఫ్రెండ్.... విత్ రిగార్డ్స్

ఒణికిపోయింది వరూధిని... ఆమెకు తెలియకుండానే ఆ ఉత్తరం గుండెలకు ఆనించుకుని వెక్కి వెక్కి ఏడ్చింది..... మృత్యుముఖంలో ఉన్నాడా అతను?!

ఆ విషయం తెలిస్తే? తెలిస్తే ఏం చేసేది?! తింటున్న మెతుకు మెతుక్కు పరాధీనమైన బ్రతుకుతో, అడుగడుక్కు కట్టుబాట్ల పేరుతో ఉరివేస్తున్న తన సాంఘిక పరిస్థితుల మధ్య ఇతని చనువు ఎంత దూరం పోతుందోనని భయపడి.... ఈ అందమైన స్నేహాన్ని చాలా చాలా మామూలుగా ఆలోచించి ఆపుచేసింది.... నిజమే.....

కానీ.....

ఆ రోజు నుంచీ వరూధిని జీవితాన్ని తెలియకుండానే ఆ అపరిచిత శ్రేయోభిలాషి ప్రభావితం చేశాడు. ఆమెలో ఆమెజీవితంలో చాలామార్పు, ఆత్మస్థైర్యం. జీవితం పట్ల ఆసక్తి పెరిగాయి. జీవితాన్ని ప్రేమించింది. తద్వారా, చుట్టూ ఉన్న ప్రపంచం కొంచెం ఆకుపచ్చగా, అందంగా కనిపించింది. అకారణ కోపం, ఉక్రోషం, తన మీద తనకు కచ్చ పోయాయి. అలా శిధిల శిల్పం లాంటి ఆమె జీవితాన్ని, తెలియకుండానే నగిషీలతో ఒక అద్భుత కళాఖండంగా మార్చుకున్నది.

కానీ ఏ వెన్నెలవేళో, ఆకాశంలో చుక్కలు లెక్కపెట్టుకుంటూ, 'అజ్ఞాన స్నేహితుడా! ఎక్కడున్నావు నువ్వు?' అని కదిలిపోతున్న మేఘాలను, సుదూర తీరాల్లో రాలిపోతున్న నక్షత్రాల్ని చూస్తూ అడుగుతూనే ఉంటుంది ఆమె.

❀ ❀ ❀

"ఎందుకు మామ్మా, కళ్ళంబడి నీళ్ళు? ఏమిటి ఆలోచిస్తున్నావు?" తలార బెట్టుకుంటూ వచ్చింది ప్రజ్ఞ.

"ఏం లేదమ్మా! జీవితం గురించి... దశాంగం పత్రా... పొగ వేస్తాను..." అన్నది వరూధిని.

ఆమెనే చూస్తూ ఆలోచిస్తూ లోపలికి అడుగువేసింది ప్రజ్ఞ.

(ఉదయం - 27-11-1986)